320) దేసాక్షి / కల్యాణి

ప॥ కోటానుకోట్లాయ కోరికెలు జన్మములు । కూటున గూడి రాట్నపుగుండ్రలై నారయ్యా ॥

చ॥ మిన్నుపైనున్న జీవులు మన్నుపై బ్రవేశించి । అన్నద్వారమున దేహము మోచి ।
మున్నిటిదానఫలా లిమ్ముల భుజించి యప్పటి । తిన్ననికర్మములు గాదెల బోసేరయ్యా ॥

చ॥ యిరవు మఱచి మఱి యెరవులకాపిరేల । సురలు నరులమంటా జొక్కి చొక్కి ।
సొరిది లోకములెల్లా జొచ్చి కాలగతులను । పొరి నాయుష్యము గొల్చిపోయుచున్నారయ్యా ॥

చ॥ దండగాగ దిరుమలకొండ యెక్కి సుజ్ఞానులు । పండిమనసుతోడ బత్తిసేసి ।
అండనే శ్రీవేంకటేశు నలమేల్మంగను గొల్చి । నిండునిధానములై నిల్చినారయ్యా ॥